క్లుప్తంగా

మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కృష్ణారెడ్డి



వర్ధన్నపేట : పట్టణానికి చెందిన అనిమిరెడ్డి కృష్ణారెడ్డిని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించినట్టు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రకటించారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ జయకేతనం ఎగరేసేలా కార్యాచరణ అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే ముందస్తుగా కృష్ణారెడ్డి నియామకం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, భూక్యా శ్రీలత, నాయకులు రామ్ నాయక్, సిలివేరు శ్రీధర్, పులి శ్రీనివాస్, చందు రవి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి మహాయాగం



నర్సంపేట : పట్టణంలోని సర్వాపురంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు హనుమాన్ మహాయాగం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. మహాయాగానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి వెనుముద్దల శ్రీధర్‌రెడ్డి, నాయకులు పోతిరెడ్డి నర్సింహారెడ్డి, కూచన రాజు, బుద్దె లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడి మృతి



శ్రీనివాస్ (ఫైల్)

పర్వతగిరి : మండలం వడ్లకొండకు చెందిన కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కట్ల శ్రీనివాస్ శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఉద్యోగికి తీవ్రగాయాలు

దుగ్గొండి : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని తొగర్రాయిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొందరు రైతుల ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోగా ట్రాన్స్‌కో తాత్కాలిక ఉద్యోగి తుమ్మలపెల్లి రామరాజు మరమ్మతుకు ఉపక్రమించాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్‌ఫేజ్ సరి చేస్తుండగా దాని మీదుగా వెళ్తున్న 11 కేవీ నుంచి విద్యుత్ ప్రసారం కావడంతో రామరాజు విద్యుదాఘాతానికి గురయ్యాడు. ట్రాన్స్‌ఫార్మర్‌పైనే పడి మంటల్లో చిక్కుకున్నాడు. స్థానికులు రామరాజును హనుమకొండలోని అజరా ఆస్పత్రికి తరలించారు. రామరాజును మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. రామరాజు సోదరుడైన బీఆర్‌ఎస్ నాయకుడు తుమ్మలపెల్లి మహేందర్‌తో కలిసి పెద్ది సుదర్శన్‌రెడ్డి వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పెద్ది వెంట మాజీ ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, పార్టీ నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ ఓడేటి తిరుపతిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు యార శ్రీనివాస్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట : పట్టణంలో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఆ శాఖ ఏఈ విజయభాస్కర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వల్లభ్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల్లో భాగంగా ఉదయం 8.30 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంగెం : లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా పని చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తహసీల్దార్ రాజ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిన క్రమంలో సర్వే, భూరికార్డుల విభాగంలో పని చేసేందుకు ఎంపికైన వారికి ఈనెల 26 నుంచి శిక్షణ ఉంటుందని తెలిపారు. ఇంటర్‌లో గణితంలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఐటీఐ డ్రాఫ్ట్స్‌మెన్, డిప్లొమా, బీటెక్ సివిల్ పూర్తి చేసిన యువత ఈనెల 17లోగా మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

డబ్బులిస్తేనే గన్నీ బ్యాగులు..!

● కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ఆందోళన



కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులతో మాట్లాడుతున్న ఎస్సై రాజు

వర్ధన్నపేట : పట్టణంలోని పిరంగిగడ్డ సమీపంలోని సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు డబ్బులిస్తేనే గన్నీ బ్యాగులు ఇస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొనుగోలు కేంద్రం వద్ద రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. దీంతో ఎస్సై రాజు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఖాళీ సంచుల లారీని చాటుగా నిలిపి పైసలిచ్చిన వారికే బ్యాగులిస్తున్నారని పలువురు రైతులు పోలీసుల ఎదుట వాపోయారు. నిర్వాహకులను నిలదీసినా పట్టించుకోవడం లేదన్నారు. రైతుల నుంచి హమాలీకి, లారీ కిరాయి మామూలు, ఖాళీ సంచుల పేరుతో వివిధ రూపాల్లో డబ్బు వసూలు చేస్తున్నారని వాపోయారు. దీంతో ఎస్సై రాజు స్పందించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి రైతులతో క్యూలైన్ ఏర్పాటు చేయించి ఒక్కో రైతుకు 100 చొప్పున ఖాళీ సంచులు ఇప్పించి ఆందోళన విరమింపజేశారు.



ఖాళీ సంచుల కోసం లైన్‌లో నిల్చున్న రైతులు

డబ్బులిస్తేనే సంచులు ఇస్తున్నారు

కొనుగోలు కేంద్రం నిర్వాహకులు డబ్బులు ఇచ్చిన వారికే సంచులు చాటుగా ఇస్తున్నారు. నేను 20 రోజుల క్రితం కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చా. ఇప్పటివరకు నాకు సంచులు ఇవ్వలేదు. వర్షం కురిస్తే తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకుంటూ తిరిగి రాశి పోసుకుంటుండడంతో ఆర్థికంగా భారమవుతోంది.



– ఓర్సు ఎల్లస్వామి, రైతు, వర్ధన్నపేట

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రమేశ్

● కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు రమేశ్

నర్సంపేట : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు కన్నెబోయిన రమేశ్ యాదవ్ తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని ఈర్యతండాకు చెందిన గుగులోతు రమాదేవి రాజ్ కోటికి మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయడంలో కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. ఇంటి నిర్మాణ క్రమంలో దశలవారీగా నిధులు మంజూరవుతాయని తెలిపారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య గౌడ్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు బండి పద్మ, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు గుగులోతు నాని, నాయకులు చెవ్వ వెంకటేశ్వర్లు, మెంతుల రమేశ్, కంది నారాయణరెడ్డి, మారెల్లి కుమారస్వామి, గుగులోతు రాంధన్, రాజు, కిషన్, గణేశ్, నరేశ్, రాజు, మమత, యాకమ్మ, సలేంద్రచారి, పైడి రాజు, వజ్జంతి రమేశ్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

భీంరెడ్డి పోరాటం స్ఫూర్తిదాయకం

● ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్



నివాళులర్పిస్తున్న రమేశ్, నాయకులు

నర్సంపేట : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి త్యాగాలు స్ఫూర్తిదాయకమని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో శుక్రవారం భీంరెడ్డి నర్సింహారెడ్డి 17వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భీంరెడ్డి నర్సింహారెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రమేశ్ మాట్లాడారు. భీంరెడ్డి నర్సింహారెడ్డి విద్యార్థి దశలోనే దొరల, నిజాం రజాకార్ల ఆగడాలు సహించలేక ఆంధ్ర మహాసభ కార్యక్రమాలకు ఆకర్షితుడై క్రమంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నేతృత్వం వహించిన ఆరుగురు అగ్రగణ్యుల్లో ఒకరిగా ఎదిగారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నర్సింహారెడ్డి కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, నల్గొండ యూనివర్సిటీతోపాటు ఎస్సారెస్పీ రెండో దశకు ఆయన పేరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కన్నం వెంకన్న, కుసుంబ బాబురావు, బూరబోయిన నర్సయ్య, గోనెల రతన్, శివప్రసాద్, శ్రీనివాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వెంకటయ్య, నాయకులు

● యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య

నెక్కొండ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య కోరారు. సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నాయకులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సుదీర్ఘ పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేలా 4 లేబర్ కోడ్‌లుగా సవరించిందని విమర్శించారు. సదరు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండలవ్యాప్తంగా సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజలూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి చెలకలపల్లి వీరస్వామి, నాయకులు సాయిలు, దేవేందర్, యాకయ్య, రాజు, స్వరూప, నాగమ్మ, ఎలీషా, కృష్ణ, ప్రభాకర్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రసేన విజయ స్ఫూర్తితో ఉద్యమించండి

● సీపీఎం జిల్లా నాయకుడు ఈసంపెల్లి బాబు

నర్సంపేట : మితవాద శక్తులు విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో రెండో ప్రపంచ యుద్ధంలో ఫాసిజంపై ఎర్రసేన సాధించిన విజయ స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఈసంపెల్లి బాబు కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో కలకోటి అనిల్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన రెండో ప్రపంచ యుద్ధ విజయం 80వ వార్షికోత్సవ సభకు బాబు హాజరై మాట్లాడారు. రెండో ప్రపంచ యుద్ధంలో ఫాసిస్టు సైన్యాలపై ఎర్రసేన విజయం సాధించిన 80 సంవత్సరాలు అవుతోందని చెప్పారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ రాజ్యాంగ నిర్వీర్యానికి కుట్ర చేస్తోందని, ఫాసిస్టు నియంతృత్వ అమలుకు పూనుకుందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులు దోచుకునేలా కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా సవరించారని విమర్శించారు. ఈనెల 24న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి హన్మకొండ శ్రీధర్, నాయకులు వజ్జంతి విజయ, జగన్నాధం, కార్తీక్, గనిపాక ఇంద్ర, విలియం కేరి, లక్ష్మి, సరిత, పైస గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీరన్న విగ్రహ ప్రతిష్ఠాపన

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో అక్కమహంకాళి, కామరతీదేవి సమేత బీరప్పస్వామి విగ్రహాన్ని శుక్రవారం ప్రతిష్ఠించారు. మూడ్రోజులుగా విగ్రహానికి వేద మంత్రోచ్చారణల నడుమ పూజలు నిర్వహించారు. అనంతరం యంత్ర సహిత విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా దిష్టికుంభం, బలిప్రదానం, పూర్ణాహుతి, పండిత సన్మానం నిర్వహించారు. సాయంత్రం కురుమ కుల మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల నడుమ ఆలయానికి తరలివెళ్లి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్, కుల పెద్ద మనిషి అన్న లింగన్న, ఉప కుల పెద్ద మనిషి బుడిగొండ చంద్రయ్య, వైస్ చైర్మన్ అమ్మ కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి చీర కట్టయ్య, సహాయ కార్యదర్శి కొక్కరకొండ అంజి, కోశాధికారి నరిగె భిక్షపతి, నాయకులు బుడిగొండ సతీశ్, నరిగె అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ, 5 ట్రాక్టర్ల సీజ్

దుగ్గొండి : చెరువు నుంచి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, 5 ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని బంధంపల్లిలోని చెరువు నుంచి మట్టిని తరలించడానికి సిద్ధమవుతుండగా ట్రెయినీ ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు జేసీబీని, ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసును తహసీల్దార్ విచారించి జేసీబీ, ట్రాక్టర్ల యజమానులకు జరిమానా విధించారని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

వనభోజనాలు




రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లి గ్రామ ముదిరాజ్ కులస్తులు శుక్రవారం వనభోజనాలకు తరలివెళ్లారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంట పొలాల్లో వనభోజనాలు చేసుకుని సందడి చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండి అధి దిగుబడులు రావాలని కాంక్షిస్తూ వనదేవతలైన బంగారమ్మకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు చిక్కుడు శ్రీనివాస్, దొంతరబోయిన సోమయ్య, యాదగిరి, ప్రశాంత్, ఉమాదేవి, రాజేశ్వరి, సోమలక్ష్మి, సారమ్మ, అన్నెపు కుమార్, రవి, అనూష, సునిత, పూజ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



గీసుకొండ : మండలంలోని వంచనగిరికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఇల్లందుల ఏలియా కొద్ది రోజుల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. తొలుత ఏలియా చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్‌లో పెండ్లి దేవేందర్‌కు రూ.38 వేల, ఆమడగాని కుమారస్వామికి రూ.25 వేల, శీలం శంకర్‌కు రూ.44 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ సిద్దన రమేశ్ శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో చెక్కులు మంజూరైనట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చీర అశోక్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కడుదూరి సంపత్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్ ఉపసర్పంచ్ ఊరుగొండ లింగస్వామి, అమీనాబాద్ తండా గ్రామ కమిటీ అధ్యక్షుడు భానోతు రవి, బాపూజీ పురుషుల సంఘం అధ్యక్షుడు మురహరి రవి, నాయకులు దామోదర్‌రెడ్డి, చిరంజీవి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

శాంతిస్థాపనకు కృషి చేయాలి

● రెవరెండ్ డాక్టర్ రుబెన్ మార్క్



చర్చిని ప్రారంభిస్తున్న రుబెన్ మార్క్, తదితరులు

నల్లబెల్లి : సమాజంలోని ప్రతిఒక్కరూ శాంతిస్థాపనకు కృషి చేయాలని బిషప్ రెవరెండ్ డాక్టర్ రుబెన్ మార్క్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలో నిర్మించిన సీఎస్ఐ పరితోమా చర్చిని నిర్మాణ దాత డాక్టర్ నాగెల్లి సామ్యూల్‌తో కలిసి డాక్టర్ రూబెన్ మార్క్ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రారంభించారు. అనంతరం రూబెన్ మార్క్ మాట్లాడారు. సంఘస్తుల ఆకాంక్ష మేరకు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చర్చి నిర్మాణానికి డాక్టర్ సామ్యూల్ ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. తొలుత రుబెన్ మార్క్, డాక్టర్ సామ్యూల్‌లకు సంఘస్తులు, క్రైస్తవులు ఘన స్వాగతం పలుకుతూ ఊరేగించారు. కార్యక్రమంలో సంఘ కాపరి ఈసంపెల్లి ప్రసాద్, సెక్రటరీ నాగెల్లి ప్రకాశ్, ట్రెజరర్ కనుకం నవీన్, యూత్ సెక్రటరీ కొండి అశోక్, నాగెల్లి పావని, జన్ను జయరావు, మనుగొండ ప్రసాద్, భారత, కరుణ, సురేఖ, అనూష, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

● డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి

రాయపర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని డీసీఈబీ సెక్రటరీ గారె కృష్ణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, ప్రధాన కూడళ్లలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీఈబీ సెక్రటరీ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యున్నత విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం యూనిఫారాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్నం భోజనం తదితర వసతులు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు చదువులతోపాటు ఆటపాటల్లోనూ రాణించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్టు వివరించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ స్కూళ్లలోనే చేర్పించి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, ఎస్‌వీబీ.శర్మ, రోజారాణి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, సురేందర్, రాధ, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

● జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

వర్ధన్నపేట : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి తెలిపారు. మండలంలోని కట్య్రాలలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'స్నేహ' గ్రూప్ సెషన్‌లో భాగంగా బాలికలకు ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలు ఆరోగ్యానికి చేటని చెప్పారు. బాల్యవివాహం వల్ల పునరుత్పత్తి, ఆరోగ్యం, ప్రభావాలు, కేరీర్ తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్ దుష్ప్రభావాలు, ఇతర అంశాలు వివరించారు. బాలికలు, మహిళలు ఏవైనా సమస్యలు తలెత్తితే 1098, 181, 100, 1930, 14567, 155326 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించి రక్షణ పొందాలని సూచించారు. బాధిత మహిళలు, బాలికలకు పోలీసులు, చైల్డ్‌లైన్ ప్రతినిధులు అండగా ఉంటారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీసీ స్వామి, ఎస్‌హెచ్‌జీ సీఏ స్వప్న, మంజుల, అంగన్‌వాడీ టీచర్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

పొదుపుతోనే ఆర్థికాభివృద్ధి

● సంఘం అధ్యక్షుడు ఎల్లగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లగౌడ్

సంగెం : సంపాదనలో కొంత పొదుపు చేస్తేనే ఆర్థికాభివృద్ధి సాధించగలమని శ్రీరామలింగేశ్వర పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు గుండెబోయిన ఎల్లగౌడ్ తెలిపారు. మండలంలో శ్రీరామలింగేశ్వర పురుషుల పొదుపు సంఘం 28వ వార్షిక మహాసభ శుక్రవారం నిర్వహించారు. మొత్తం 962 మంది సభ్యులతో రూ.3.96 కోట్ల నిధులు కలిగి ఉన్నట్టు బాధ్యులు నివేదిక సమర్పించారు. ఈ సందర్భంగా ఎల్లగౌడ్ మాట్లాడారు. సంఘాన్ని సమన్వయంతో నడిపిస్తున్నట్టు తెలిపారు. సభ్యుల సహకారంతో సంఘం ముందడుగు వేస్తోందని చెప్పారు. అనంతరం సభ్యుల సంఖ్య అధికంగా ఉండడంతో సహకార చట్టం ప్రకారం సంఘాన్ని రెండు విభాగాలుగా విభజించారు. తదనంతరం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా గుండెబోయిన ఎల్లగౌడ్, ఉపాధ్యక్షుడుగా కడ్దూరి కరుణాకర్, రెండో సంఘం అధ్యక్షుడుగా సాధిక్, ఉపాధ్యక్షుడుగా అనుమాండ్ల జనార్దన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు గూడ సుదర్శన్‌రెడ్డి, సీడీఎఫ్ ప్రతినిధి భాస్కర్, పాలకవర్గం, సభ్యులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

● ఉద్యాన శాఖ డివిజన్ అధికారి జ్యోతి



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి

నర్సంపేట రూరల్ : ఆయిల్‌పామ్ సాగు చేస్తే అధిక లాభాలు సాధించొచ్చని ఉద్యాన శాఖ నర్సంపేట డివిజన్ అధికారి అల్లకొండ జ్యోతి తెలిపారు. నర్సంపేట మండలంలోని కమ్మపల్లిలో రైతు జయపాల్‌రెడ్డికి చెందిన ఆయిల్‌పామ్ తోటను శుక్రవారం ఆమె సందర్శించి మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. జనుము నాటితే కలిగే లాభాలు, ఎరువుల యాజమాన్యం, నీటి ఏర్పాటు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పంటను చట్ట ప్రకారం ఎంపిక చేసిన పరిశ్రమలే కొనుగోలు చేస్తాయని చెప్పారు. పంట సేకరణకు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. త్వరలోనే తొలి పంట దిగుబడి రానుందని వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ టెక్నికల్ అధికారి రాకేశ్, రాంచరణ్, సతీశ్, రాకేశ్, కరుణాకర్, శ్రీనాథ్, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన

దామెర : మండలంలోని ముస్త్యాలపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. భూలక్ష్మి, పోచమ్మ, పోతరాజు విగ్రహాలను ప్రతిష్ఠించి యంత్రపూజ నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ కిష్టోజు రవీంద్రాచార్యుల వేద మంత్రోచ్చరణల నడుమ పూజలు చేశారు. గ్రామస్తులు ముత్యం, పగడం, బంగారం, నాణాలు, నవ ధాన్యాలు సమర్పించారు. బలి పూర్తయ్యే వరకు గ్రామానికి రాకపోకలు నిలిపేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కాశీప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.